# బలహీనత

-కుంతి

డియర్ శశీ !

మన పాతికేళ్ల మైత్రిలో ఇలాంటిరోజు వస్తుందని నీవు కానీ,నేను కానీ ఊహించి ఉండము. రోజు పక్కపక్కనే ఆఫీసు లో గడిపే మనము, ఫ్యామిలి ఫ్రెండ్స్ మైన మనము, అపూర్వమైన స్నేహితులని పిలిపించుకునే మనము ఇలాంటి విపత్కర పరిస్థితిలో పడడము విధి కాకుంటే మరేమిటి?

బహుశా మన స్నేహానికి ఇది అగ్ని పరీక్ష కాబోలు.అవునూ..

సెల్ ఫోన్లు, ఈ-మెయిల్లు ఉండగా ఉత్తరమేమిటి?అనుకుంటున్నావా?

కొన్ని కొన్ని భావాలుపంచుకోవడానికి ఉత్తరమే సబబేమో!

అసలు విషయానికి వస్తాను.

హ్యూమన్ బ్రెయిన్ ,హ్యూమన్ ఎమోషన్స్ చాలా చిత్రమైనవి.కొన్ని వందల ,వేల మెదళ్ళను చదవగలిగే శక్తి ఉన్నా,ఎక్కడో ఒక మెదడును చదవలేకపోతాము అన్నది నిజము. ఎందుకంటే కొన్ని దశాబ్దాలుగా మనతో సన్నిహితంగా ,మనతో మమేకమై ఉండే వారిలో కూడా ఒక అపరిచిత వ్యక్తి,ఒక అనూహ్యమైన వ్యక్తిత్వము ఉంటుందని నాకు ఇప్పుడే అనుభవము లోకి వచ్చింది. నేను కలలో కూడా ఊహించని సంఘటన ఒకటి నాకు ఎదురైంది.

వారము రోజుల కిందట నాకు ఒక కొరియర్ లో ప్రేమలేఖ వచ్చింది.

షాక్ అయ్యావా? అపుడే షాక్ అవ్వకు! ఇంకా చాలా ఉంది.

ముందుగా ఆ ప్రేమలేఖ మా అమ్మాయికి వచ్చిందమో అనుకున్నాను. కానీ నా పేరు తో నే వచ్చింది. యాభై సంవత్సరాలవయసులో ,తల నెరిసి,కీళ్ళూ,గూళ్ళూ అరిగిన ఈ వయసులో నాకు ప్రేమలేఖ ఏమిటి? ఇదెవరో నన్ను ఆట పట్టించడానికో, చల్లగా సాగుతున్న మా సంసారాన్ని అస్తవ్య స్తము చేయడానికో అనుకున్నాను.లేదా నాకు ఎవరైతే రాసారో ,వారిని ఎవరైనా ఇబ్బంది పెట్టాలని రాసి ఉండవచ్చని అనుకున్నాను.

చికాకు వేసింది.భయము వేసింది. ఆసక్తి కూడా వేసింది.

నా పేరుతో వచ్చిన కొరియర్ లో మొత్తము రెండు ఉత్తరాలు ఉన్నాయి. ఒక దాని పై అందమైన దస్తూరితో ప్రేమలేఖ అని రాయబడి దానికింద లేఖ నంబర్ 1 అని రాయబడిఉంది.మరొక దానిపై లేఖ నంబర్ 2 అని రాయబడి ఉంది.

ఆ రొజు మావారు కానీ,మా అమ్మాయి కానీ ఇంటిలో లేరు.మొదటి లెటర్ చించాను. చదవడము ప్రారంభించాను. అంతే నా కాళ్ళ కింద నేల బద్దలయినట్లు.నన్ను ఎవరో వేల సమ్మెటలతో బాదుతున్నట్లు అనిపించింది. నేను సరిగ్గా చదవడము లేదేమో, నా కళ్ళు మసకలు కమ్మాయేమో అనుకొని,నన్ను నేను కుదుట పరుచుకొని మళ్ళీ,మళ్ళీ చదివాను.

నిజమే. అది ప్రేమ లేఖ యే.

అది నేను పాతిక సంవత్సరాలుగా “అన్నాయ్యా!”అని పిలుచుకుంటున్న ,నా కష్ట సుఖాలకు దేవుడు పంపిన ఆసరాగా భావిస్తున్న శ్రీ రామచంద్ర మూర్తి గారు రాసినది. అది ఇంకా పెద్ద షాక్!

అవును నీవు చదువుతున్నది నిజమే!

అది నీ భర్త శ్రీ రామచంద్ర మూర్తిగారు రాసినదే!

కంగారు పడకు,సిగ్గుతో కుంచించుకుపోకు.వేదనతో,క్రోధముతో నీ మనసును బాధ పెట్టుకోకు. జరిగినది నిజము.

ఇక ఆ లేఖలో మాఅన్నయ్య గారు అద్భుతమైన భావుకత కనబరిచారు.నాపై సుందరమైన కవిత్వాన్ని చెప్పారు. నా అంగాంగాలను వైవిధ్య భరితముగా వర్ణించారు.

ఒక వేళ నిజంగా ఈ లేఖ యే పాతిక సంవత్సరాల క్రితమో నాకు చేరిఉంటే ,అప్పటికి మన పరిచయాలు కాకుంటే బహుశా నాలోని వయసుపొంగు ఆ భావాలకు ఎలాప్రతిస్పందించేదో?

ఆహా! ఎంత గొప్పగా ప్రేమను ఆవిష్కరణ చేసాడు. ఎంత అందంగా తన హృదయాన్ని నా ముందు పరిచాడు. మా అన్నయ్య ఒక వేళఈ మూడ్ లో యే కావ్యమో రాసి ఉంటే,సాహిత్యానికి చెందిన అవార్డులు అన్నీ ఆయనకేదక్కేవి.

నేను గుండెను దిటవు చేసుకొని ఆ లేఖ ఆసాంతము చదివాను. ఇక ఆ రెండవ లేఖలో యేముందోనన్న ఆసక్తితో అదీ విప్పి చదివాను.

అది నన్ను ఇంకా ఆశ్చర్యాన్ని కలిగించింది!

ఇక్కడ నీ ఈ లేఖను ఆపుతాను. నీవు కూడా ఇక్కడ చదవడము ఆపు. కొరియర్ లో నేను రాసిన లేఖ తో పాటు మీ వారు రాసిన లేఖ నంబరు 1, లేఖ నంబర్ 2 జతపరిచాను. అందులో మీ వారు నాకు రాసిన లేఖ నంబర్ 2 అని రాసి ఉన్నది తీసి చదువు.

నీ ప్రియ నేస్తము

సుశీల

అంత వరకు యేమి చదువుతుందో ,యేమి జరుగుతుందో అర్ధము కాని శశికళతనకు వచ్చిన కొరియర్ పాకెట్ నుండి నంబర్ .2 లేఖ తీసి,సుశీల చెప్పిన విధముగా చదవడము ప్రారంభించింది.

-------------------

డియర్ సుశీల

నేనొక ప్రేమ పిపాసిని.నాకు యుక్త వయసువచ్చినప్పటి నుండి ఎవరినైనా గాఢంగా ప్రేమించి ,పెళ్ళి చేసుకోవాలని కోరిక. నా భావాలను, నా మనసును నేను చదివిన వేలకొలది సాహిత్య పుటల ఆధారంగా నా ప్రేయసికి పంచాలని నా తపన.

నా ప్రేమలేఖకు చదివిన నాప్రేయసి తన హృదయపు ప్రేమ సింహాసనము పై నన్నదిష్టింప చేయాలని నా కోరిక. కాని నేను మధ్య తరగతి కుటుంబము నుండి వచ్చిన వాడిని.బాధ్యతలు,బరువులు,కష్టాలు,కన్నీళ్ళు తప్ప సరసాలకు .శృంగారాలకు,భావుకతకు తావు లేని వాడిని. మా నాన్న నా పై మోపిన ఇంటి బాధ్యతలు మోస్తూ, ఒక వైపు కష్టపడి చదువుకుంటూ,మంచి ఉద్యోగాన్ని పెతుక్కోవడముతో నాకు పాతిక సంవత్సరాలు వచ్చాయి.నా కోరిక మనసు అట్టడుగున సమాధి అయింది. ఇంతలో నాప్రమేయము లేకుండా నాకు వివాహమయింది. నా భార్య దేవత,అనుకూలవతి.నిజానికి నేను నాప్రేయసిలో చూడాలి అనుకున్న సుగుణాలు అన్ని నా భార్యలో ఉన్నాయి.ఆమె నన్ను అమితంగా విశ్వసించింది.ప్రేమించింది.నేనూ అంతగానే ప్రేమించాను. ఎక్కడా,ఎప్పుడూ అమెకు లోటు రానీయలేదు. కానీ నాలో అపుడపుడు తీరని కోరికగా మిగిలిన –ప్రేమించడము,ప్రేమ లేఖలు రాయడము అన్న భావనలు చావలేదు.భార్యను ప్రేమించవచ్చుగా! భార్యకు ప్రేమలేఖలు రాయ వచ్చుగా! ఎందుకో నా స్వప్న ప్రపంచములో ,నా ఊహల్లో ఉన్న ఆలోచనకు,దానికి పొంతన కుదరలేదు. ఇంకొకరిని

ప్రేమించడము అనే భావనను ,దేవతలాంటి నా ఇల్లాలి వల్ల దూరము చేయగలిగాను.కాని ప్రేమలేఖ రాయాలి అన్న లేకి తపన నుండిబయట పడలేక పోయాను.అంటే నా దృష్టిలో ఈ పాటికి ప్రేమించడము ,ప్రేమలేఖ రాయడము రెండు ప్రత్యేక అంశాలుగా మారిపోయాయి. ఎన్నో సార్లు అద్భుతమైన ప్రేమలేఖలు రాసాను. బహుశా అవన్నీ పోగు చేస్తే తెలుగు సాహిత్యము లో అవి ఒక ప్రత్యేక ప్రక్రియగా ,దానికి నేను అద్యుడిగా ఉండే వాడినేమో. నేను రాసిన ప్రేమలేఖలో నేను అమితంగా ప్రేమించే భార్యకు కూడా చూపలేదు.చించేసే వాడిని. అయితే ఎప్పుడు నా మనసులో ఒక పురుగు తొలిచేది. రాసిన ప్రేమ లేఖను ఎవరికైనా పోస్ట్ చేయాలని అనిపించేది.

అమ్మో! ఇంకా ఏమయినా ఉందా?

నా పరువూ.ప్రతిష్ఠలు ఏమయిపోతాయి. నా కుటుంబము,మరొక కుటుంబము నవ్వుల పాలుపవుతుంది. నా యీ దుశ్చర్య,మతిమాలిన లేకి చేష్ట వలన కాపురాలు ముక్కలై పోతాయి. కాని నా హృదయ బలహీనత, నా క్యాన్సరస్ క్రేజ్ నా మెదదును గెలిచింది. ఎవరికైనా పోస్ట్ చేయాలని,నిశ్చయించుకున్నాను.అందుకే నిన్ను ఎంచుకున్నాను. అంత మాత్రాన నిన్ను గాఢంగా ప్రేమించానని,గాఢంగా ప్రేమిస్తానని కాదు.నీ వు నన్ను ప్రేమించాల్సిన అవసరము లేదు. నీవు ప్రేమించ వద్దు కూడా.

అంతే రాయాలనిపించింది.రాసాను. నేనొక పిచ్చి వాడిని.నా చేతిలో రాయి ఉంది ,విసిరాను. నీవైతే మళ్ళీ విసరవు. నన్ను అర్ధము చేసుకుంటావు.రభస చేయవు.వావీ వరుసలు ,సభ్యత,సంస్కారము విడిచి నేను చేసిన ఈ పనిని బహుశా క్షమిస్తావు.

నా మనసు మెదడును గెలిచింది.

నా బలహీనత ప్రేమలేఖ రూపములో ఎజాక్యులేట్ అయింది.

నా మనసు విప్పి చెప్పాను.వీలైతే క్షమించు.

ఇంత తప్పు చేసిన తరువాత క్షమించకపోయినా పరవాలేదు.విషపు విత్తనము నాటితే తీయని పండ్ల చెట్టు పెరగదని నాలు తెలుసు.పచ్చి మిరప కొరికితే ,తీయదనము రాదుకదా. పరిణామాలకు సిద్దంగా ఉన్నాను.

నీ విజ్ఞతనిన్ను ఎలా నడిపిస్తే అలా నడువు.

నా మనసు , నా మెదడును గెలిచిన ఆనందముతో సేదతీరుతుంది. ఇంక చాలు అని సంతోషపడుతుంది. ఈ లేకి తనము ఇదే మొదటి సారి మరియు చివరిసారి. కాబట్టి నావల్ల భవిష్యత్తులో ఎవరికీ బాధ లేదు.

ఒక వేళ నా యీ చేష్ట వల్ల నీకు ఇబ్బందులు ఎదురైతే ,నా తలనరుక్కొని అయినా నీ కష్టము తీరుస్తాను.

నీ/????

శ్రీ రామచంద్రమూర్తి

------------

లేఖను ఆసాంతము ఒకటికి రెండు సార్లు చదివిన శశికళ హిప్నటైజ్ కు గురైన వ్యక్తిలా మళ్ళీ తన ఫ్రెండ్ సుశీల రాసిన లేఖ,ఎక్కడైతే ఆపిందో అక్కడి నుండి చదవడము ప్రారంభించింది.

డియర్ శశి!
ఈపాటికి లేఖ చదివి ఉంటావు.నాకు తెలుసు– నీవు ఎంతో క్షోభకు గురి అయ్యావని,నీ మనసు కల్లోలంగా ఉందని.
బీ కూల్ మై డియర్! ఒక వేళ నేను కూడా ఆందోళన పడి ఉంటే ఈ లేఖ రాసే దానిని కాదు. ఇపుడు మనము ప్రశాంతముగా ఉండాలి.విచక్షణతో ఆలోచించాలి. మీ శ్రీవారు ..మా అన్నయ్య గారు చెడ్డవారు కాదు. ఈ ప్రేమ లేఖ రాయాలి అన్న అంశము తప్ప ,మరే ఇతర బలహీనతలు లేవు.
దశాబ్దాలుగా మనసులో గూడుకట్టుకు పోయిన ఒక పిచ్చి కోరిక అన్నయ్యను బలహీనుడిని చేసి,ఇలా బయటపడేసింది. సమాజములో ఇలాంటి వారు చాలామంది ఉంటారు.
సంఘము,కట్టుబట్లు,మర్యాదలు,బాధ్యతలు అనేవి లేకుంటే ,ప్రతి వ్యక్తిలో ఎక్కడో ఒక చోట పొంచి ఉన్న రాక్షసుడు సమయము చూసుకొని బయటపడుతుంటాడు.
మనలో చాలా మంది తమకు లభించని ,మానసిక అనుభూతులకై ,భౌతిక సంపదలకై ,శారీరక సుఖాలకై వెంపర్లాడుతుంటారు. అయితేవిచక్షణ వారిని అదుపు చేసినంత కాలముఉత్తములుగానే ఉంటారు. జీవిత కాలములో యే ఒక్క సారి ఆ విజ్ఞత,విచక్షణ లోపించినా,ఇదిగో మా అన్నయ్యలా దేవురిస్తారు.
మరొక విషయము ఆయనకు ప్రేమను ప్రేమించాలని,ప్రేమలోకములో విహరించాలని,ప్రేమలేఖలను రాయాలని తప్ప ,ప్రస్తుతము నన్ను కానీ మరొకరిని కానీ ప్రేమించాలని లేదు. కాబట్టి మనము సేఫ్.
ఈ విషయాన్నంత నీకు చెప్పక దాచిపెట్టవచ్చు. కాని ఈ వీషయము మరొకరి ద్వారా తెలిసినా,మరొక రూపములో తెలిసినా మన బంధము తెగిపోవచ్చునని, అన్నయ్యలో ఉన్న ఈజాడ్యము నీకూ తెలియాలని ఈ ఉత్తరము రాసాను.
అదృష్ట వశాత్తు నన్ను ఎంచుకోవడము,సమయానికి ఇంటిలో ఎవరూ లేకపోవడము మనము చేసుకున్న అదృష్టము.నేను కూడా యీ విషయము ఇక్కడే మరిచిపోయాను. ఈ సంఘటనమన స్నేహమునకు విఘాతము కారాదు. ఇక ఈ విషయమును ఇక్కడ ఆపేద్దాము. రేపటి ఆదివారము నేనూ,మావారు,మా అమ్మాయి మీ ఇంటీకి వస్తాము. నేనూ,నీవు యేమీ యెరగనట్టే ఉందాము.
బహుశా అన్నయ్య కూడా అలగే ఉంటాడు.
మరొక మాట పసి పిల్లవాడు తప్పు చేస్తే,తల్లి ఎలా సవరిస్తుందో నీవు అలాగే ప్రవర్తించు.లేనిపోని ఆరాటాలతో,అర్భాటాలతో కలతలు సృష్టించుకోకు. నీవు నా కన్నా ఉన్నతంగా ఆలోచించగలవు. అసలు నాలో యీ అలోచనా జ్ఞానము అంత నీ వల్లనే కదా.
ప్రేమతో
నీ సుశీల

---

తాను చదివిన ఉత్తరాలను పక్కన పెట్టింది శశి.ఒక్కసారిగా ఆమెమనసూ,మెదడు నిస్తేజమయ్యాయి.భూగృహములో పాతి పెడుతున్నట్లుగా, వందలాది సమ్మెటలతో బాదుతున్నట్లుగా తోచింది.

తాను ఎంతగా భర్తను ప్రేమించింది.పిచ్చిగా ఆరాధించింది. ఇంతకాలము అర్ధనారీశ్వరుల్లాగా బతుకుతున్నామనుకున్నది.కానీ తన అర్ధ భాగమొక అర్ధము కాని ప్రహేళిక అని యిపుడే అర్ధమయింది.ఈ బాధను ఎలా దిగమింగాలి.శతృత్వాన్ని,దౌర్జన్యాన్ని ఎదుర్కోవచ్చు.కాని ఇది వెన్నుపోటు,దీనిని ఎలా భరించేది. ఇంకా అతడితో కాపురము ఎట్లా చేసేది. సుశీలకు తను ముఖము ఎట్లా చూపేది.ఇంకా అతడిలో ఎన్ని పార్శ్వాలు ఉన్నాయో?

నో____తట్టుకోలేను!

క్షమించడము ,సహించడము సుశీల చెప్పినంత తేలిక కాదు.అది బలహీనత యే కావచ్చు.తాత్కాలికమే కావచ్చు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య ఉండకపోవచ్చు.

కానీ...కానీ...భరించలేను...క్షమించలేను...క్షమించలేను...అనుకుంటూ చేతిలో ఉన్నా కాగితాలను ముక్కలుగా చించి వేసి,కమోడ్ లో వేసి ఫ్లష్ అవుట్ చేసింది. కాగితాలను నీటిలో కలపగలిగింది.కాని మనసులో చేలరేగుతున్న భావాలను ఫ్లష్ అవుట్ చేయలేకపోయింది.

ఇంతలో యేదో అలికిడి కావడము తో బాల్కనీలోకి వచ్చింది.

0తమ అపార్ట్ మెంట్ లో ఉంటున్న మహాలక్ష్మి పనిపిల్ల పై అరుస్తుంది.

" నిజము చెప్పు నీవు ఉండగాఆ బొమ్మలన్ని ఎక్కడికి పోతాయి.రెండేళ్ళ మా బంటీ ఇంటి నుండి కదలడు. వేలకు వేలుపోసికొన్నాము.హెలికాప్టర్లు,ట్రైయిన్‌లు ,కార్లు,జంతువుల బొమ్మలు,ఒక్కటీ కనబడడము లేదు.మేము లేనప్పుడు నీవే కదా ఉండేది? దొంగ ఎవరైనా దూరితే ,ఖరీదైన సామాన్లేవి పట్టుకు పోకుండా బొమ్మలే పట్టుకు పోతాడా?"

" సత్యము అమ్మా! నాకేమి తెలియదు. బాబు ముందు బొమ్మలు వేసి ,నేను ఇంటి పనులు చేసుకుంటున్నపుడు ఎవరైనా తీసుకుపోయారేమో? అయినా నాకు ఆ బొమ్మలు ఎందుకమ్మా?

నాకు పిల్లలా?జెల్లలా? ఇట్లా అయితే నేను పని వదులుకుంటాము" అంటూ చేతిలో ఉన్న చీపురు నేలపై విసిరి అ పని మనిషి వెళ్ళి పోయింది.

అసలే బుర్ర హీటెక్కి ఉండడముతో, ఈ గొడవతో నాకేమిటో అనుకొని ,బెడ్ రూమ్ వైపుకు నడిచింది.మరొక బెడ్ రూమ్ లో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న కొడుకు ఉన్నాడు.తలుపు వారగా వేసింది.యేదో చప్పుడు వస్తుంది.అసంకల్పితముగా తలుపు తీసి లోపలికి చూసింది.

ఒక్క సారిగా షాక్ అయింది.

ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న ఇరవై ఐదు సంవత్సరాల తన కొడుకు ,హెలికాప్టర్,ట్రైయిన్,జంతువుల బొమ్మలతో చప్పట్లు చరుస్తూ,గెంతుతూ ,పసిపిల్ల వాడిలా ఆనందంగా ఆడుకుంటున్నాడు.

"రాహుల్ ! ఏమిట్రా నీవు చేస్తున్నది? ఈ బొమ్మలు ఎక్కడివి? అయినా ఈ వయసులో ఈ ఆటలేమిటిరా?"అని కోపంగా ప్రశ్నించింది.

రాహుల్ బిక్కముఖము వేసి నిలబడ్డాడు. అతడు ఈ కాలము నాటి కుర్రవాడు కాదు. చిన్నప్పటి నుండి తల్లిదండ్రుల కట్టుదిట్టమైన క్రమశిక్షణలో పెరిగినవాడు.

"మాట్లాడవేమిటిరా?" మళ్ళీ తల్లి గద్దించింది.

"అమ్మా! ఇవి బంటీ బొమ్మలు. నాకు చిన్నప్పటి నుండి ఇలాంటి బొమ్మలతో ఆడుకోవాలని ఉండేది. కానీ నాకు ఎప్పుడూ స్కూల్ ,హోం వర్క్, ట్యూషన్లు,మార్కులు,కార్పొరేట్ కాలేజీ చదువు,ఎంసెట్ కోచింగ్ ,ఆపై ఇంజనీరింగ్ ____ వీటితోనే గడిచిపోయింది. నేను చిన్నప్పుడు బొమ్మలని

అడిగినప్పుడల్లా నన్ను కోప్పడేవారు. నాకు బొమ్మలంటే భలే సరదా.. నా మనసులో ఎప్పుడు ఇలా ఆడుకోవాలని ఉండేది.నన్ను మీరు ఇంటా,బయటా ఎప్పుడూ ఆడుకోనిచ్చేవారు కాదు.
నా చిన్నప్పుడు నా తోటి వారంతా రకరకాల బొమ్మలతో ఆడుతుంటే వాటిని ముట్టుకోవాలని, వాటితో ఆడుకోవాలని ,వాటి వింతలు అనుభవించాలని నామనసు తపన పడేది.
ఎప్పుడు ఆడుకుందామని అనుకున్నా, "లక్ష్యము పెట్టుకో,దాని కోసము కృషి చేయి.దానికై మేము రెక్కలుముక్కలు చేసుకుంటాము. లక్షలు ఖర్చు పెడతాము"అనే వారు.అలాగే చేసారు.
నాకు మీరు ఖరీదైన బట్టలు కొనిచ్చారు.వేలు,లక్షలు పోసి మంచి స్కూల్స్ లో ,మంచి కాలేజీ లలో చదివించారు.కాని చిన్న చిన్న సరదాలు నానుండి దూరము చేసారు.అరె! పదో పరకకో వచ్చే బొమ్మలు మాత్రము కొనిచ్చే వారు కాదు.దానితో ఆ కోరిక అలాగే ఉండి పోయింది. బంటీ బొమ్మలతో ఆడుతుంటే ,ఒక్కసారిగా నాకూ ఆడుకోవాలనిపించింది. అందుకే వాడిని ఏమార్చి, బొమ్మలు తెచ్చుకున్నాను,ఆడుకుంటున్నాను______________
అమ్మా! తప్పు చేసాను కదూ. అవును తప్పే. కానీ చిన్ననాటి నుండి తీరని కోరికగా మిగిలి పోయిన ఈ కోరిక ,ఒక్కసారిగా అన్ని వింతవింతబొమ్మలను చూడగానే, నా మనసును తప్పుచేసేలా పురికొలిపింది.
నా మనసు మెదడును గెలిచింది.
ఈ తప్పు నాది కాదు,ఎంత అణిచి పెట్టుకన్నా,అణిగిఉండలేని నా బలహీనతది.
అమ్మా! క్షమిస్తావు కదూ"అంటూ కళ్ళలో నీళ్ళతో దోషిలా నిలబడ్డాడు రాహుల్.
చెలియలికట్టలు దాటేలా ఎగిసిన కెరటాలు,వెనక్కి వెళ్ళి కడలి గర్భములో శాంతించినట్లుగా శశి మెదడులో ఉప్పొంగిన ఆలోచనా కెరటాలు ఎగిసి,ఎగిసి తీవ్ర నిర్ణయాలు అనే చెలియలి కట్టలు దాటాలని ప్రయత్నించి,చివరికి యేదో శక్తి వెనక్కిలాగినట్లుగా మనోసాగరములో శాంతించాయి.
కెరటాలు ఎంత ఉప్పొంగినా వరద రూపములో కడలి తీరము దాటకుంటేనే క్షేమము.
ఆలోచనల తీవ్రత కూడా ఆచరణల రూపములో మనసు దాటకుంటేనే క్షేమము అని యెరిగినది కావున శాంత గోదావరి అయింది శశి. ఆమె ముఖము పై చిరునవ్వు వెలిసినది.
"క్షమిస్తాను నాన్నా! నిన్నే కాదు. నీ లాంటి వాళ్ళలో అదును చూసుకొని అంతరంగాన్ని దాటి బయటపడే బలహీనతను కూడా.
అయినా ప్రేమించడమంటే ప్రేమించిన వ్యక్తుల బలహీనతలను,అసహ్యాలను క్షమిస్తూ ముందుకు పోవడమే కదా".

కుంతి
(కె.కౌండిన్య తిలక్)
ఫ్లాట్ నం.203
శ్రీ సాయి ఎంక్లేవ్
శ్రీనివాస్ నగర్ కాలనీ
టెంపుల్ ఆల్వాల్
సికింద్రాబాద్-500010
8790920745
9441234325